క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ డీఎస్పీ



సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను మంగళవారం ఆదోని ప్రొబేషనరీ (ట్రైనీ) డీఎస్పీ ధీరజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు విధి విధానాలపై సబ్‌కలెక్టర్ పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ పాత్ర కీలకమని, బాగా పని చేయాలని సూచించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సిబ్బంది

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని ఆదోని–సిరుగుప్ప సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం రాత్రి ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తనిఖీ చేశారు. అటుగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.50 వేలకు మించి నగదును తరలించినట్లయితే ఆ మొత్తాన్ని సీజ్ చేస్తామని చెప్పారు. అలాగే మాదకద్రవ్యాలు తరలించరాదని, వాహనాల రికార్డులు తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాలుకా సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోరుముద్ద స్టాకు పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పంపిణీపై ఫిర్యాదులు రావడంతో మంగళవారం ఎంఈఓ–2 మధుసుదన్‌రాజు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గుడ్లు, చిక్కీలు, రాగిపిండి, బియ్యంను ఎప్పటికప్పుడు విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. గడువు తీరిన గుడ్లు, చిక్కీలు, రాగిపిండిని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఆర్‌పీవీఎఫ్ సంఘ నాయకులు ఖాజ, కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను పరిశీలించి వంట ఏజెన్సీ వారికి సూచనలిచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్.కైరవాడి గ్రామంలో హంద్రీ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. గోనెగండ్లలోని లక్ష్మీపేటకు చెందిన గొల్ల రంగస్వామి మంగళవారం మధ్యాహ్నం హెచ్. కైరవాడి గ్రామంలోని హంద్రీలో ట్రాక్టర్‌లోకి ఇసుకను లోడ్ చేసుకొని తరలిస్తుండగా పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మంగంపల్లె స్టేజ్ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్ వెనుక పొలాల్లో మంగళవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వెల్దుర్తి మండలానికి చెందిన ఇద్దరు, డోన్ మండలానికి చెందిన 9 మందిని అదుపులోకి తీసుకొని పేకముక్కలతోపాటు 11 సెల్‌ఫోన్లు, 11 బైక్‌లు, రూ.92 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పలువురు పరారయ్యారని కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్

మద్దికెర: ఆటోలు, బొలెరోలు, టాటా ఏస్‌లలో కూలీలను కెపాసిటీకి మించి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు మిరప కోతల కోసం లెక్కకు మించి కూలీలను తరలిస్తుండగా అడ్డుకుని వాహనాలను వెనక్కి పంపించివేశారు. వారు మాట్లాడుతూ.. లైసెన్సు లేని డ్రైవర్లు వాహనాలు నడపడం వల్ల, తగిన ఫిట్‌నెస్ లేని వాహనాలను తిప్పుతుండడంతో ప్రమాదాలు జరిగి మహిళలు మృతి చెందుతున్నారన్నారు. కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మారెమ్మవ్వ ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దుండగులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని మారెమ్మవ్వ ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రెండు హుండీలను పగులగొట్టి డబ్బులు, అమ్మవారివి కొత్రమీసాలు, వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఆలయానికి భక్తులు వెళ్లగా చోరీ జరిగిన విషయం వెలుగుచూసింది.



నాడు - సచివాలయానికి వెళ్లే రోడ్డు దుస్థితి



నేడు - సిమెంటు రోడ్డు వేసిన తర్వాత



నాడు - కోసిగి వెంకటేశ్ ఇంటి నుంచి సుబ్బయ్య షాపుకు వెళ్లే రోడ్డు



నేడు - రోడ్డు వేసిన తర్వాత ఇలా..

గ్రామాల్లో కొత్త కళ



నాడు - మేళిగనూరు రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం



నేడు - సుందరంగా రూపుదిద్దుకున్న గుడి ప్రాంగణం



నాడు - అధ్వానంగా ఉన్న బసవన్న గుడి రోడ్డు



నేడు - కళకళలాడుతున్న సీసీ రోడ్డు

కౌతాళం: గ్రామీణ రోడ్ల కొత్త కళను సంతరించుకున్నాయి. దశాబ్దాల నుంచి ఎదురు చూస్తున్న రోడ్లకు మోక్షం లభించాయి. ప్రభుత్వం పల్లె రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేయడంతో రోడ్డు పనులు పూర్తయ్యాయి. మండల పరిధిలోని నదిచాగి గ్రామస్తులతో పాటు మజరా గ్రామం అయిన మేళిగనూరు వాసుల కల నేరవేరింది. నదిచాగి గ్రామంలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయడంతో అవస్థలు తప్పాయి. గతంలో మోస్తరు వర్షం కురిసినా వీధులన్నీ బురదమయంగా మారేవి. డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైనే ప్రవహించేది. గత ప్రభుత్వం హయంలో ఎన్నోసార్లు విన్నపించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో స్థానికులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించారు. రూ. 50 లక్షలతో రామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో భక్తులకు ఇబ్బందులు తొలగాయి. అలాగే మేళిగనూరు గ్రామంలోని అన్ని రోడ్లను రూ.4 లక్షలతో గ్రావెల్ రోడ్లుగా మార్చారు. నదిచాగి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మఠం, సచివాలయం, పాఠశాలకు వెళ్లే రోడ్డును రూ. 3 లక్షలతో సిమెంటు రోడ్డుగా మార్చారు. మొన్నటి వరకు వర్షకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉండేది. అలాగే కోసిగి వెంకటేశ్ ఇంటి నుంచి సుబ్బయ్య కిరాణం షాపు వరకు ప్రధాన రోడ్డును రూ.12 లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంటు రోడ్డు వేశారు. మెయిన్ రోడ్డు నుంచి బసవన్న గుడి వరకు ఉన్న రోడ్డును రూ. 4.60 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సిమెంటు రోడ్డు వేశారు. గ్రామంలోని చాలా రోడ్లు పూర్తికావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ నిధులతో పనులు చేశామని.. ఇంకా గడప గడప నిధులు ఉన్నాయని, వీటితో గ్రామంలో మరింత అభివృద్ధి పనులు చేపడుతామని సర్పంచ్ మహేష్, ఎంపీటీసీ సభ్యుడు లింగన్నగౌడ్ తెలిపారు.

- ఏప్రిల్ 6 నుంచి వార్షిక పరీక్షలు
- సిద్ధమవుతున్న 1 నుంచి 9వ తరగతుల విద్యార్థులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు

వార్షిక పరీక్షలకు సన్నద్ధం



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పాఠశాల విద్యార్థులు విద్యా సంవత్సరం ముగింపు దశలో ఉన్నారు. ఒక పక్క ఎండ వేడిమి ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోపక్క వార్షిక పరీక్షలను ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1 నుంచి 5 తరగతుల వారికి ఏప్రిల్ 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. అదేవిధంగా 6 నుంచి 9 తరగతుల వారికి ఏప్రిల్ 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. వీరిలో 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 9వ తరగతి విద్యార్థులకు మాత్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 12.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 3 నుంచి 8 తరగతుల విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9వ తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. ఆదోని పట్టణ గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో చదువుతున్న 52,256 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులుగా ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలల పునఃప్రారంభం జూన్ 12వ తేదీన ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రశ్నాపత్రాల పంపిణీకీ చర్యలు

జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ప్రశ్నాపత్రాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. కామన్ ఎగ్జామ్ బోర్డు డీసీఈబీ ప్రశ్నాపత్రాలను పూర్తి స్థాయిలో ఆయా పాఠశాలలకు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాటిని సరిచూసుకుని ఎమ్మార్సీలో భద్రపరిచారు.పరీక్షల ప్రారంభం రోజు నుంచి ఏరోజుకారోజు సంబంధిత ప్రశ్నాపత్రాల బండిళ్లను పరీక్షకు గంట ముందు ఎమ్మార్సీ నుంచి ప్రధానోపాధ్యాయుడు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

టైం టేబుల్

పరీక్షల నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ టైంటేబుల్ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఏప్రిల్ 21వ తారీఖు నుంచి జావాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఏప్రిల్ 23వ తేదీన ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అంజేయడంతో పాటు తరగతుల వారీగా ప్రమోషన్ జాబితాలను సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.

1 నుంచి 5 తరగతుల వారికి..

1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు 6వ తేదీన తెలుగు, 8న ఇంగ్లిష్, 10న ఇంగ్లిష్ పార్ట్–బి(టోఫెల్), 12న గణితం, 13న పరిసరాల విజ్ఞానం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలలో ప్రధానమైన పరీక్షలు 13వ తేదీన ముగుస్తాయి. 15న ఓఎస్‌ఎస్‌సీ, 16న 4వ తరగతి విద్యార్థులకు మాత్రం స్టేట్ లెవల్ ఎచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) పరీక్ష నిర్వహించనున్నారు.

ఆరు నుంచి తొమ్మిది తరగతుల వారికి..

6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 6వ తేదీ తెలుగు, 8న హిందీ, 10న ఇంగ్లిష్ పార్ట్–ఏ, 12న ఇంగ్లిష్ పార్ట్–బి (టోఫెల్), 13న గణితం, 15న ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు జనరల్ సైన్స్, 9వ తరగతికి ఫిజికల్ సైన్స్, 16న బయలాజికల్ సైన్స్, 18న సోషల్ స్టడీస్, 19న 8, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులు/ఓఎస్‌ఎస్‌సీ 1 అండ్ 2 పరీక్షలు, అదే రోజు 6, 7 తరగతులకు పేపర్–1, పేపర్–2 పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రశ్నాపత్రాల పంపిణీకి ఏర్పాట్లు



వార్షిక పరీక్షల నిర్వహణకు ప్రశ్నాపత్రాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. ఎస్‌సీఈఆర్‌టీ నిబంధనలు ప్రకారం పరీక్షలు నిర్వహిస్తాం. ఎటువంటి అపోహలకు తావులేకుండా పబ్లిక్ పరీక్షల మాదిరిగానే వార్షిక పరీక్షలను నిర్వహించాలి. లోపాలు లేకుండా పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాం. పరీక్షలు అయిన వెంటనే జవాబు పత్రాలను దిద్ది మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

– వెంకటరమణారెడ్డి
డిప్యూటీ ఈఓ, ఆదోని

72 శాతం పన్నుల వసూలు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి, నీటి పన్ను వసూలు 72 శాతం పూర్తయినట్లు మున్సిపల్ రెవన్యూ ఆఫీసర్ అస్లాంబాషా మంగళవారం తెలిపారు. ఆస్తి పన్ను రూ.14 కోట్లు డిమాండ్ కాగా, అందులో రూ.10 కోట్ల మేర వసూలు చేసి 72 శాతం మేర సాధించామన్నారు. నీటి పన్ను రూ.8 కోట్లు టార్గెట్ కాగా రూ.2.50 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో నీటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు.

ఓటుతో మంచి నాయకుడిని ఎన్నుకోండి

కౌతాళం: ఓటు హక్కును వినియోగించుకుని మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని ఏక్తా యాంటి కరప్షన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు నబిరసూల్ అన్నారు. మంగళవారం కౌతాళంలో ఆయన మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే దేశానికి నిజాయితీపరులైన నాయకులు కావాలన్నారు. దేశాభివృద్ధి చేసే మంచి అభ్యర్థులకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ఏక్తా యాంటీ కరప్షన్ పోరాడుతుందని తెలిపారు. పేదలకు వ్యాపార అభివృద్ధి కోసం సహకారం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారదర్శక పాలనకు పట్టంకట్టండి



చిన్నభూంపల్లిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మురళీమోహన్ రెడ్డి

కోసిగి: పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోసిగి మండలంలోని చిన్నభూంపల్లి, పెద్ద భూంపల్లి, దొడ్డి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘటన వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఇలాంటి పరిపాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. మరోసారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున గౌడ, బసిరెడ్డి, కాల్వ లక్ష్మయ్య, దొడ్డి నరసన్న, లక్ష్మయ్య, గట్టు భీముడు, లక్ష్మీరెడ్డి, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో - బేటీ పడావోపై అవగాహన



వాల్ పోస్టర్లను విడుదల చేసిన పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డి



బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, ఆయాలు

ఆదోని సెంట్రల్: బేటీ బచావో– బేటీ పడావోపై ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం సీడీపీఓ అంగన్‌వాడీ కార్యకర్తలు పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డిని కలిసి పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. మెప్మా కార్యాలయం, పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల, శంకర్ నగర్, హవ్వన్న పేట కాలనీలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ.. భ్రూణహత్యలు, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులు బాలికలను చిన్న చూపు చూడకుండా వారిని చదివించాలన్నారు. 11 నుంచి 17 ఏళ్ల వయసున్న బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికలను చదివించాలి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం పీహెచ్‌సీ పరిధిలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దివ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, పుష్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దివ్య మాట్లాడుతూ.. ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. ఆడ పిల్ల ఇంటికి వెలుగు అని, బాగా చదివించుకుని ప్రయోజకురాలిగా తీర్చిదిద్దుదామన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది హేమలత, కస్తూరి, రత్నమ్మ, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో దాడులు నిర్వహించి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో ఆయన మాట్లాడుతూ.. దైవందిన్నె గ్రామంలో తనిఖీలు చేపట్టి ఈడిగ ఉరుకుందు అనే వ్యక్తి అక్రమంగా కలిగి ఉన్న 576 (90 ఎంఎల్) ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 36 వేలు ఉంటుందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా సెల్ నెంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, హెచ్‌సీ లింగప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో బెల్లపు భాస్కర్‌నాయుడు కర్ణాటక మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. గ్రామంలోని ములుగుందం రోడ్డులోని బ్రహ్మయ్య దేవాలయం వద్ద మంగళవారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి 30 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం బిలేహాలు గ్రామంలో సెబ్ పోలీసులు సోదాలు నిర్వహించి బోయ రాధమ్మ అనే మహిళ నుంచి 4 బాక్సులు (384 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సిబ్బంది శ్రీనివాసులు, విజయుడు, నాగరాజు, లక్ష్మీదేవి ఉన్నారు.

25 బాక్సుల మద్యం స్వాధీనం

హొళగుంద: మండలంలో కర్ణాటక మద్యం అమ్మకాలపై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది మంగళవారం దాడులు చేపట్టారు. హెబ్బటం గ్రామంలో ఓ వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాలోకి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తెచ్చి కళ్లంలో నిల్వ చేసినట్లు గుర్తించారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి 25 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

హోం ఓటింగ్‌పై అధికారులకు దిశానిర్దేశం



సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



హాజరైన బీఎల్‌ఓలు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు

ఆదోని రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి ముఖ్యమైనదని, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బీఎల్‌ఓలకు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు హోం ఓటింగ్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం అధిక వైకల్యమున్న వారికి, 85 ఏళ్ల వయస్సు పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు వినియోగించుకోవడం ముఖ్యమని, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలతో పాటు బీఎల్‌వోల ద్వారా తమ ఓటు వివరాలు తెలుసుకోవాలన్నారు. హోం ఓటింగ్ కోసం అర్హులైన వారు ఫారం–12డీ సాయంతో పీ.బీ.మార్కింగ్ చేయించుకోవాలన్నారు. నియోజకవర్గంలో హోం ఓటింగ్ విధానాన్ని పూర్తిస్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పోలింగ్, భద్రతా సిబ్బంది ఉన్న ప్రత్యేక బృందం హోం ఓటింగ్‌లో భాగస్వామ్యమవుతుందని, ఓటింగ్ విధానాన్ని వీడియోగ్రఫీ చేయడం జరుగుతుందని సబ్‌కలెక్టర్ వివరించారు.

ఫారం–12 ద్వారా హోం ఓటింగ్

ఎన్నికలు జరిగే మే 13వ తేదీని దృష్టిలో ఉంచుకొని హోం ఓటింగ్‌కు అర్హులైన వారి నుంచి ఏప్రిల్ 18 నుంచి 23వ తేదీ వరకు ఫారం–12డీ దరఖాస్తులను సేకరించి దాని ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పించాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. హోం ఓటింగ్ విధానం ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌తో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు వర్తింపజేశారు. త్వరలో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ హోం ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తుండడంతో అధికారులు అందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ సూచించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, తహసీల్దార్ హసీనాసుల్తానా, డీఎల్‌పీవో కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎలక్షన్ ఉప తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ఉప తహసీల్దార్ రుద్రగౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

మద్దికెర: మద్దికెర శివార్లలో మార్చి 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మ (65) చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గత నెల 31న మిరప పంట కోతలు చేపట్టేందుకు వాహనంలో దాదాపు 30 మంది మహిళా కూలీలు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మద్దికెర శివార్లలో వాహనం టైరు పేలి అదుపుతప్పి ప్రమాదానికి గురవడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం గుంతకల్లు, కర్నూలు తదితర ప్రాంతాలకు తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వారిలో సావిత్రమ్మ కోలుకోలేక మృతి చెందింది.

చలివేంద్రం ఏర్పాటు



బనవాసిఫారం నర్సరీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసిఫారంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సెంట్రల్ నర్సరీ వద్ద రోడ్డుపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వాటర్‌షెడ్ పీఓ వలిబేగ్, కోర్సు డైరెక్టర్ సుజాతమ్మ, ఏపీ ఓ విజయమోహన్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్, నర్సరీ టీఏ వితేంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



41వ వార్డు అడ్మిన్ అశోక్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

ఆదోని టౌన్: తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నామని పేర్కొంటూ మంగళవారం 11 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను 41, 42 వార్డుల సచివాలయం అడ్మిన్ అశోక్‌కు అందజేశారు. 41వ వార్డు పరిధిలో 10 మంది పనిచేస్తుండగా అందులో ఐదుగురు రాజీనామా చేశారు. ఓంకార్, చిన్మయి, అరుణాభాయి, నందిని, రాజమ్మ రాజీనామా పత్రాలను అందజేశారు. అలాగే 42వ వార్డు పరిధిలో 10 మంది వలంటీర్లకు గానూ ఆరుగురు అమరేష్, హనుమంతురావు, లక్ష్మీనారాయణ, గణేష్, రాణి, సంగీత అడ్మిన్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ పత్రాలను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సమర్పించనున్నట్లు అడ్మిన్ అశోక్ తెలిపారు. ప్రభుత్వం నుంచి తమకు పూర్తి సహకారం ఉండేదని, నాలుగున్నరేళ్లపాటు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ఉపాధి పొందామన్నారు. అయితే నేడు కొంతమంది రాజకీయ పార్టీల నాయకులు తమ పట్ల అనుచితంగా వ్యవహరించడం వల్లే తాము మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని, ప్రతిపక్ష పార్టీల నాయకులు తమపై లేనిపోని నిందారోపణలు ఆపాదించడం, తమ పట్ల అగౌరవంగా మాట్లాడుతూ కించపరచడం వల్ల మనస్తాపం చెంది రాజీనామా చేశామని వాపోయారు.